Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANIVARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 361 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 18 - 6 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లాల్సిన విమాన సర్వీసు రద్దు




**న్యూఢిల్లీ :** ఎయిర్ ఇండియా విమానాల్లో తలెత్తుతున్న సాంకేతిక లోపాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఢిల్లీ నుంచి పారిస్‌కు మంగళవారం నాడు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో సర్వీసును రద్దు చేశారు. విమానం వెళ్లడానికి ముందు చేపట్టిన తనిఖీల్లో సాంకేతిక లోపం కనిపించడంతో ఫ్లైట్ సర్వీసును రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. ఏఐ-143 విమానంలో ప్రీ-ఫ్లైట్ చెకింగ్‌లో కనిపించిన సాంకేతిక లోపాన్ని సరిచేసే పనిలో సాంకేతిక నిపుణులు ఉన్నట్టు ఏఐ ప్రతినిధి తెలిపారు. సమయాభావంతో పాటు పారిస్ చార్సెల్ డి గల్లె అంతర్జాతీయ విమానశ్రయం వద్ద అర్ధరాత్రి వేళల్లో ఆంక్షలు ఉన్నందును విమాన సర్వీసును రద్దు చేయడం మినహా మరో మార్గం లేకపోయిందని అధికారులు చెప్పారు. దీంతో జూన్ 18న పారిస్ నుంచి ఢిల్లీకి రావాల్సిన రిటర్న్ ఫ్లయిట్ AI142 కూడా రద్దయిందని తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, సాధ్యమైనంత త్వరలో ప్రయాణికులను వారి గమ్యాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ఏఐ ప్రతినిధి చెప్పారు. హెూటల్ సదుపాయంతో పాటు టిక్కెట్ అమౌంట్ తిరిగి చెల్లించేందుకు, కోరుకుంటే ప్రయాణం రీషెడ్యూల్‌కు కూడా వెసులుబాటు కల్పిస్తున్నట్టు వివరించారు. కాగా, దీనికిముందు అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్లాల్సిన ఏఐ-159 బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్‌లోనూ సాంకేతిక లోపాలు తలెత్తాయి. షెడ్యూల్ ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు బయలుదేరాల్సి ఉండగా, దీనికి ముందు తనిఖీలు చేపట్టారు. సాంకేతిక లోపం తలెత్తడంతో వెంటనే సర్వీసును నిలిపి వేశారు.

# బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఈపీసీ కీలక భేటీ




**న్యూఢిల్లీ :** బనకచర్ల ప్రాజెక్ట్‌పై కేంద్ర పర్యావరణ నిపుణుల అంచనాల కమిటీ (ఈఏసీ) ఈరోజు (మంగళవారం) భేటీ అయ్యింది. పోలవరం – బనకచర్ల ప్రాజెక్ట్ పర్యావరణ అనుమతులపై ఈ సమా వేశంలో చర్చించనున్నారు. ప్రొఫెసర్ చక్రపాణి నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటు అయ్యింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఈ కమిటీ సమావేశమైంది. ఇందులో భాగంగా ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను ఈ కమిటీ పరిశీలించనుంది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల కలిగే పర్యావరణ ప్రభావాన్ని కమిటీ అంచనా వేయనుంది. పోలవరం – బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం, సీఎం చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు అనుమతి ఇవ్వాలంటూ ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రులు అమిత్ షా, సీఆర్ పాటిల్‌కు అనేకసార్లు వినతి చేశారు కూడా. ఈ క్రమంలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తొలి అడుగుపడింది. బనకచర్ల ప్రాజెక్ట్‌పై ఈఏసీ కీలక సమావేశం ప్రారంభమైంది. ప్రాజెక్ట్ చేపట్టడం వల్ల జరిగే పర్యావరణ ప్రభావం ఏ విధంగా ఉంటుంది అన్నదానిపై కమిటీ అంచనా వేయనుంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగానే తదుపరి అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఈ సమావేశాన్ని ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అయితే బనకచర్ల ప్రాజెక్ట్‌ను పూర్తిగా అనుమతింకూడదని, రిజెక్ట్ చేయాలంటూ తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. ఈఏసీకి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం అనుమతి లేకుండా, ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని తెలి పారు. గోదావరి నీటిని కృష్ణలో కలిపేందుకు ప్రయత్నం చేస్తున్నారని, దీనివల్ల తెలంగాణ హక్కులను హరించినట్లు అవుతుందని... ఈ ప్రాజెక్ట్‌కు ఏమాత్రం అనుమతులు ఇవ్వొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఈ క్రమంలో నేటి సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను ఈఏసీ ఏ విధంగా పరిగణలోకి తీసుకుంటుంది, ఈ ప్రాజెక్ట్‌కు పర్యావరణ ప్రభావం ఏ విధంగా ఉండబోతుంది అనే దానిపై కేంద్రానికి కమిటీ నివేదిక ఇచ్చే అవకాశం ఉంది. పోలవరం – బనకచర్ల ప్రాజెక్టులతో పాటు ఉత్తరప్రదేశ్‌లోని పంప్‌డ్ స్టోరేజ్ ప్రాజెక్టలపైనా ఈ కమిటీ సమావేశం జరుగుతోంది.

# నేరప్రవర్తన ఉన్నవారిని ప్రోత్సహిస్తున్న జగన్.. ధూళిపాళ్ల ఫైర్




**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పొన్నూరు ఎమ్మెల్యే, తెలుగుదేశం సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ వల్లే బెట్టింగ్‌లో పాల్గొని కోట్లాది రూపాయలు కోల్పోయిన నాగ మల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకుని చనిపోతే తమ ప్రభుత్వానికి సంబంధమేంటని ప్రశ్నించారు. ఇవాళ (మంగళవారం) అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు జరిగిన ఈ ఘటనకు ప్రభుత్వ వేధింపులు ఎలా కారణమవుతాయని నిలదీశారు. సత్తెనపల్లి పర్యటన దేనికోసమో స్పష్టం చేయాలని ప్రశ్నించారు. నటనలో జగన్‌కు ఆస్కార్ ఇవ్వాలని ఎద్దేవా చేశారు. జగన్ ప్రజల మీద ఇంకా దండయాత్ర చేస్తూనే ఉన్నారని విమర్శించారు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్. జగన్ తెరలేపిన రాజకీయ శవయాత్రకు తొలి ముద్దాయి ఆయనే అని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. తాడేపల్లి ప్యాలెస్, జగన్ అసత్యాలు ప్రేరేపించటం వల్లే నాగమల్లేశ్వరరావు కోట్లాది రూపాయలు బెట్టింగ్‌కు పాల్పడ్డారని చెప్పారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓట్లు వేయలేదనే అక్కసు, కోపం ప్రజలపై జగన్ వెళ్లగక్కుతున్నారని ధ్వజమెత్తారు. జగన్ ఇకనైనా తన పద్ధతి మార్చుకోకుంటే తాము ఇంకా నష్టపోతామని వైసీపీ నేతలు గ్రహించాలని అన్నారు. శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చే కూటమి ప్రభుత్వం అసాంఘిక శక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదని కోరారు. వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా జగన్ తన అరాచకత్వం ఇంకా వీడటం లేదని మండి పడ్డారు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్. మహిళలు ఓట్లు వేయలేదని, ప్రజలు తనకు ప్రతిపక్ష హెూదా కల్పించలేదనే అక్కసుతోనే జగన్ వ్యవహరిస్తున్నారని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విమర్శించారు. నేరప్రవర్తన ఉన్నవారిని జగన్ ప్రోత్సహిస్తున్నారని ఫైర్ అయ్యారు. జగన్ తన హయాంలో ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని నడిపారని ఆరోపించారు. జగన్ తన తీరుని ప్రశ్నించినా, పోరాడినా, విభేదించినా అక్రమ కేసులు బనాయించటంతో పాటు ప్రాణాలు హరించేలా వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదని చెప్పారు. ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రజాసమస్యలపై మాట్లాడాల్సిన జగన్ కనీసం అసెంబ్లీకి కూడా రాకపోవటం దేనికి నిదర్శనమని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# ప్రధాని మోదీ పాలన ఒక సువర్ణ అధ్యాయం

## - ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి




**విజయవాడ, (రాజధాని వార్తలు):** వికసిత్ భారత్‌కు అమృత కాలమని, పేదల సంక్షేమం, భారత దేశం గౌరవం నిలబెడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన కొనసాగుతోందని బీజేపీ ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణా రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కొరకు ప్రధాన ధ్యేయంగా పాలన ఉంటుందని, ఆర్థిక రంగంలో దేశాన్ని 4వ స్థానానికి నరేంద్రమోదీ తీసుకొచ్చారని కొనియాడారు. సేవా, సంక్షేమ కార్యక్రమాలతో ఆత్మ నిర్భర్ భారత్‌గా మోదీ పరిపాలిస్తున్నారని రామకృష్ణారెడ్డి అన్నారు.

**రాబోయే రోజుల్లో 3వ స్థానానికి...**

జల జీవన్, ఆయుష్మాన్ భారత్, ఇలా అనేక కేంద్ర పథకాలతో ప్రధాని మోదీ పేదలకు మంచి చేస్తున్నారని, పర్యావరణాన్ని కాపాడటంలో గత ప్రభుత్వాలకు భిన్నంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో రక్షణ రంగంలో ఎంత ప్రగతి సాధించామో ప్రపంచ దేశాలకు చాటి చెప్పామన్నారు. మేక్ ఇన్ ఇండియా మేడ్ ఇన్ ఇండియాలో భాగంగా రక్షణ రంగంలో కావలసిన పరికరాలను మనం సమకూర్చుకున్నామని అన్నారు. చినాబ్ నదిపై సాంకేతిక పరిజ్ఞానంతో వంతెన నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మోదీ పాలనలో ఆర్థిక వ్యవస్థ రాబోయే రోజుల్లో 3వ స్థానానికి రానుందని, నారీ వ్యవస్థలో మైనారిటీ మహిళలకు, మహిళలకు సముచిత స్థానాన్ని కల్పించారని, ఆపరేషన్ సిందూర్‌లో ఇద్దరు మహిళలు నాయకత్వం వహించారని అన్నారు.

**ప్రధాని మోదీ పాలన ఒక సువర్ణ అధ్యాయం**


సుదీర్ఘ కాలం తరువాత జనగణనకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, కులగణన చేపట్టడం జరిగిందని, వీటిపై అవగాహన లేకుండా కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలకు భారత దేశాన్ని విశ్వగురు దేశంగా చూపించేలా ప్రధాని మోదీ చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం నాయకత్వం లేదని, దేశ అభివృద్ధిపై కాంగ్రెస్ అనవసరమైన ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. యోగా దినోత్సవాన్ని ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చూసేలా మోదీ చేశారన్నారు. ప్రపంచ రికార్డులలో అరుదైన రికార్డు సొంతం చేసుకునేలా మోదీ ప్రణాళికలు చేసారన్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ లోనే ఎక్కువ సంఖ్యలో యోగా చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ యోగాలో భాగస్వామ్యం అవ్వాలని బీజేపీ పిలుపిచ్చిందన్నారు. డబల్ ఇంజిన్ సర్కార్ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని ప్రజలు మంచి విజయాన్ని అందించారన్నారు. అదే దిశగా పోలవరం, విశాఖ ఉక్కు కాపాడటం, రైల్వే జోన్, రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రం అభివృద్ధి దిశలో ముందుకు వెళుతోందన్నారు. ప్రధాని మోదీ పాలన ఒక సువర్ణ అధ్యాయంగా చెప్పుకోవచ్చునని ఎమ్మెల్యే నల్లిమిల్లి రామకృష్ణా రెడ్డి అన్నారు.

# టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఇండియాకు ఐదు దేశాల మద్దతు



**అంబేద్కర్ కోనసీమ (అమలాపురం), (రాజధాని వార్తలు):** ఆపరేషన్ సిందూర్‌ని ప్రారంభించి టెర్రరిజం అణచివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలో గయానా, పనామా, కొలంబియా, బ్రెజిల్, యునైటెడ్ దేశాలను సందర్శించారు. ఈ బృందంలో ఎంపీ హరీష్ బాలయోగి కూడా ఉన్నారు. ఢిల్లీకి తిరిగి వచ్చిన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. ఐదు దేశాలతో దౌత్యపరమైన చర్చలు జరిపినట్లు వెల్లడించారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా ఆ దేశాల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు ఎంపీ గంటి హరీష్ మాధుర్. మే 24వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ దేశాల్లో తాము పర్యటించామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ వెల్లడించారు. యునైటెడ్ నేషన్స్ పర్యటన అనంతరం ఇండియాకు చేరుకున్నామని తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడదామని ఆయా దేశాలకు తాము వివరించామని అన్నారు. పాకిస్థాన్ మిలటరీ బేస్ క్యాంప్‌నకు ఇబ్బంది లేకుండా టెర్రరిస్టులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని భారత బలగాలు దాడులు చేశాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో కలిసి ఈ పర్యటన చేశామని చెప్పారు. న్యూయార్క్ 9/11 టెర్రరిస్ట్ దాడులను జ్ఞాపకం చేసుకుని, టెర్రరి జాన్ని అంతం చేయాలనే విషయాన్ని ఆయా దేశాల ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. తాము పర్యటించిన ప్రతి దేశంలో భారతదేశానికి మద్దతు లభించిందని గుర్తుచేశారు ఎంపీ గంటి హరీష్ మాధుర్. టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఐదు దేశాల ప్రతినిధులకు భారతదేశం అండగా ఉంటుందని చెప్పామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. యుద్ధం పరిష్కారం కాదు కానీ టెర్రరిజం అంతం చేసే ప్రణాళికలకు అందరూ సహకరిస్తున్నారని అన్నారు. భార్య బిడ్డల ముందు పహల్గామ్‌లో భారత పర్యాటకులను పాకిస్థాన్ ఉగ్రవాదులు చంపడం నీచమైన చర్య అని... దీనినే ప్రపంచ దేశాలకు తెలియజేశామని చెప్పారు. ఇండియాతో కలసి రావటానికి ప్రపంచ దేశాలు మొగ్గు చూపాయని పేర్కొన్నారు ఎంపీ గంటి హరీష్ మాధుర్. పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను సమర్థవంతంగా తిప్పికొట్టామని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. పాకిస్థాన్ చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలకు తెలియజేశామని... వాస్తవాలను అందరూ గ్రహించారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో సామాన్యులకు, పౌరులకు ఎలాంటి హాని జరగలేదని గుర్తు చేశారు. పక్క ప్రణాళికతో ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశం తనకు కల్పించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి కృతజ్ఞతలు తెలిపారు.

# సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం యోచన



**అమరావతి, (రాజధాని వార్తలు):** సర్క్యులర్ ఎకానమీ పార్కుల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం యోచన చేస్తోంది. ఇందులో భాగంగానే ఇవాళ (మంగళవారం) సర్క్యులర్ ఎకానమీపై రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సర్క్యులర్ ఎకానమీ పార్కులపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టి, వనరుల పునర్వినియోగంపై సమీక్షలో చర్చించారు. అయితే 'మెటీరియల్ రీసైక్లింగ్‌కి అసోసియేషన్ ఆఫ్ ఇండియా' ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సర్క్యులర్ ఎకానమీ కింద కేంద్ర ప్రభుత్వం గుర్తించిన 11 రంగాలపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. మున్సిపల్, వాహనాలు, లిథియం బ్యాటరీలు, జిప్సం, టైర్లు, రబ్బర్, ఎలక్ట్రానిక్, వ్యవసాయం, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాల నుంచి సర్క్యులర్ ఎకానమీ సృష్టించేలా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. వీటికి అదనంగా గనులు, చేనేత, పశుసంవర్ధక శాఖలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. నగర పాలక సంస్థలు, పంచాయతీల్లో జీరో వేస్ట్ లక్ష్య సాధనకు ఏపీ ప్రభుత్వం కృషి చేస్తోంది.

# జంతు ప్రేమికులారా మీ జంతువులను ప్రేమించుకోండి

## - మా బిడ్డల ప్రాణాలను మించి కాదు - జంతువుల మెడలో లైసెన్స్ తప్పనిసరి : జనసేన జిల్లా నాయకులు గునుకుల కిషోర్

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** 45 డివిజన్ గాంధీ బొమ్మ నడిబొడ్డున చిరుజల్లులకే కాలవ డ్రైనేజీ వాటర్ బయటకు వచ్చి ఇబ్బందిగా ఉంది ఇది దీర్ఘకాలిక సమస్య దీనిని వెంటనే పరిష్కరించాలని గునుకుల కిషోర్ డిమాండ్ చేశారు. మున్సిపల్ శాఖా మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు కార్పొరేషన్ సుందరీకరణ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నవి. అక్కడక్కడ చిన్న లోటుపాట్లను సరి చేయటానికి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ప్రజల పక్షాన నిలబడుతున్నాం. గత రెండు నెలలుగా సంతపేట,కపాడిపాలెం తదితర ప్రాంతాలలోని జంతు ప్రేమికులు విచ్చలవిడిగా కుక్కలను వీధిలో వదిలేయడం వల్ల బిడ్డలకు ప్రాణాపాయంగా ఉంది.గతంలో మర్మాంగాన్ని తోలువలసి వేసిన ఒక కుక్క అయితే మరొకటి మణికట్టు ప్రాంతంలో 1/2 కేజీ కండను పీకేసిన ఒక కుక్క బిడ్డల ప్రాణాలకు హానిగా మారిందని వాటిని కట్టడి



చేయాల్సిన అవసరం ఉంది. 16వ డివిజన్ పరిధిలో ఆదిత్య నగర్ నుంచి గుర్రాల మడుగు వెళ్లే ప్రాంతంలో నడిరోడ్డు రోడ్డు మధ్యలో గల డ్రైనేజీ కాలువకి డోర్లు విరిగిపోయి ఉండడం మరొకటి ఎత్తివేయి ఉండటం వల్ల పాదచారులకు యాక్సిడెంట్లు



జరుగుతున్నాయి, వాటిని సరిచేయాలని సూచించారు. 45 డివిజన్ గాంధీ బొమ్మ సెంటర్లో రోడ్లు నిర్మాణం అప్పుడు జరిగిన అవకతవకల వలన ఇప్పటికి చిరుజల్లులకు రోడ్ల పైకి డ్రైనేజి నీరు వస్తుంది. జోరు వాన కురిస్తే మోకాల్లోతో నీళ్లలో నెల్లూరు నడిబొడ్డున ఇబ్బంది కరంగా ఉంది, సత్వరమే సమస్యను పరిష్కరించాలి రోడ్ల కాలవ లపై అక్రమ నిర్మాణాలను తొలగించి కాలవలను సరిచేయాలి. మున్సిపల్ కమిషనర్ సత్వరమే స్పందించి మీడియాని పిలిపించి పెంపుడు జంతువులకు తప్పనిసరిగా మెడలో లైసెన్స్ కట్టి ఉం డాలని, వాటికి సరైన టీకాలు వేయించాలని, నాలుగు గోడలు దాటి బయటికి వస్తే జరిగిన దాడికి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా సానిటర్ ఇన్స్పెక్టర్కు 45వ డివిజన్లో సమస్యను సత్వరమే పరిష్కారం మార్గాలను చూపే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నగర ప్రధాన కార్యదర్శి కరీం, జనసేన నాయకులు కేదారి మనోజ్,జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్,నగర కార్యదర్శి హేమచంద్ర యాదవ్, బాలాజీ సింగ్, ప్రతాప్, శ్రీనివాసులు రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# బుచ్చి ఆర్టీసీ బస్టాండ్‌ని సందర్శించిన ప్రజలకు విద్యార్థులకు సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు

## - ఆర్టీసీ బస్టాండ్‌ని సందర్శించిన ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి







**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చ జాతీయ ఉపాధ్యక్షులు మరియు ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాలెంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను ఆర్టీసీ డి ఎం.మురళీకృష్ణ మరియు ఆర్టీసీ అధికారులతో కలిసి పరిశీలించారు. పలువురు సన్నపురెడ్డి సురేష్ రెడ్డిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సన్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం ఆర్టీసీ బస్టాండ్ త్వరలోనే అన్ని వసతులతో, అన్ని హంగులతో పునరుద్ధరణ చేస్తామన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సిమెంటు రోడ్డు ఏర్పాటు చేసి, లోపల మరుగుదొడ్లను ఆధునీకరించి, ఫర్నిచర్ ను ఏర్పాటు చేసి, బస్టాండ్ లోపల మొత్తం శుభ్రంపరిచి, ప్రతి ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోనికి పోయే విధంగా చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించినారు. రాత్రి వేళలు కూడా ప్రతి బస్సు ఆర్టీసీ బస్టాండ్‌లోకి పోయేటట్టు, సిబ్బందిని రాత్రివేళ ఉండే విధంగా చర్యలు తీసుకోమని అధికారులకు తెలిపారు. నాలుగు నెలల లోపల ప్రయాణికుల సౌకర్యార్థము అన్ని వసతులతో ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరించమని అధికారుల్ని ఆదేశించినారు.

నెల్లూరు, జొన్నవాడ, పెనుబల్లి మీదుగా బుచ్చిరెడ్డి పాలెంకు ఒక బస్సును, నాగాయగుంట నుండి బుచ్చిరెడ్డిపాలెం మీదగా విద్యార్థులు, ప్రజల సౌకర్యార్థం ఒక బస్సును ఏర్పాటు చేయమని కోరగా, ఏర్పాటు చేస్తామని చెప్పినారు. ఈ కార్యక్ర మంలో బుచ్చిరెడ్డిపాలెం భారతీయ జనతా పార్టీ అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్ కుమార్, జిల్లా కార్యదర్శి కాసా శ్రీనివాసులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చేవూరు వినయ్ నారాయణ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎస్.కె, ఖాదర్ భాషా, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి సోమ లక్ష్మయ్య, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పార్లపల్లి మహేష్ నాయుడు, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోళ్ళ నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మాచ వరం శ్రీనివాసులు, వనిపెంట బాల రాఘవ రెడ్డి, బుచ్చిరెడ్డి పాలెం అర్బన్ ప్రధాన కార్యదర్శులు గోలి సురేంద్ర, గంజం పెంచల ప్రసాదు, జొన్నవాడు దేవస్థానం సభ్యులు కీలకుప్ప శ్రీనివాసులు, ఎస్ అంకిరెడ్డి,మహిళా మోర్చా అర్బన్ అధ్యక్షురాలు జనపల్లి రమణమ్మ, బీజేవైఎం అర్బన్ అధ్యక్షులు తానా మణికంఠ, అర్బన్ ఉపాధ్యక్షులు యారాసి రామారావు, కోణం శ్రీనివాసులు అర్బన్ కార్యదర్శి గాదంశెట్టి సురేష్ బాబు, కాసా వెంకట్ నాగార్జున్, నాయకులు పెద్ది సుమంత్, శివ, మహిమలూరు శ్రీనివాసులు, మహిమలూరు ప్రవీణ్ కుమార్, గోదిన వంశీ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుచ్చి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

## - పజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం - త్వరలోనే విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు







**బుచ్చిరెడ్డిపాలెం, (రాజధాని వార్తలు):** బుచ్చిరెడ్డిపాలెం పంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం ఉదయం బుచ్చి పంచాయతీలోని 20 వ వార్డు రామచంద్రాపురంలో ఆమె పర్యటించారు. అలాగే రూ.10 లక్షలతో నిర్మించ తలపెట్టిన డ్రైనేజీకి ఆమె శంకుస్థాపన చేశారు. ముందుగా 20 వార్డుకు చేరుకున్న ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం డ్రైనేజీకి శంకుస్థాపన చేసి 20 వార్డులో వసతులపై పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 20 వార్డు రామచంద్రాపురంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. 10 లక్షల నిధులతో డ్రైనేజీ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని తెలిపారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రజల కనీస అవసరాలను అనుగుణంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. స్థానికంగా స్మశానానికి ప్రహరీ లేని విషయాన్ని స్థానికులు తమ దృష్టికి తెచ్చారని, త్వరలోనే ప్రహరీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. అలాగే స్థానికంగా ప్రజలకు అందుబాటులో సచివాలయం లేనందున సుదూర ప్రాంతానికి వెళ్లాల్సి వస్తోందని, ప్రభుత్వ అధికారులతో సంప్రదించి సచివాలయం ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు. త్వరలోనే విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని, ప్రజలందరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బుచ్చి ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, స్థానిక కౌన్సిలర్ శ్రీదేవి, సునీల్, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు అనుగుణంగా పార్టీ కమిటీలు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పార్టీ నిబంధనలకు అనుగుణంగా వార్డు, గ్రామ, మండల కమిటీలను ప్రకటిస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నియమించిన పరిశీలకులతో సోమవారం నగరంలోని విపిఆర్ నివాసంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ విధి విధానాలపై చర్చించారు. కమిటీలను ప్రకటించే విషయంలో అనుసరించాల్సిన విధివిధానాలు, ఇతర అంశాలపై మాట్లాడారు.

పార్టీ విధేయులకు, పార్టీకి సేవలందిం చిన వారికి అధిక ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయం తీసుకోనున్నారు. ఆయా మండలాధ్యక్షులు, మండల నాయకుల సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలం టౌన్ పరిశీలకులు మామిడాల మధు, బుచ్చి రూరల్ పరిశీలకులు మీదూరి ప్రశాంత్ కుమార్, కోవూరు మండల పరిశీలకులు దామవరపు సుబ్బారావు, కొడవలూరు మండల పరిశీలకులు కువ్వారపు బాలాజీ, విడవలూరు మండల పరిశీలకులు దర్శి హరికృష్ణ, ఇందుకూరుపేట మండల పరిశీలకులు కాకర్ల తిరుమల రావు, నియోజకవర్గ ముఖ్య నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, వీరేంద్ర నాయుడు, వింజం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టాలు మంజూరు చేయండి

## - రైతు సంఘం నాయకులు, ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య



**ఆత్మకూరు, (రాజధాని వార్తలు):** నియోజకవర్గంలో సీజెఎఫ్ఎస్‌లో సభ్యులుగా బలహీన వర్గాలకు చెందిన 100 కుటుంబాల వారికి పట్టాలు మంజూరు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఆత్మకూరు ఆర్డీఓ పావనికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో రాష్ట్ర ప్రభుత్వం సీజెఎఫ్ఎస్‌ను రద్దు చేసి వ్యక్తిగత పట్టాలను మంజూరు చేస్తామని పేద రైతులకు హామి ఇచ్చిందని, ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రైతులకు పట్టాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఇటివల రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి నిరుపయోగంగా ఉన్న నీటి వనరులకు చెందిన భూమలలో ఇళ్లు నిర్మించుకున్నప్పటికి, వ్యవసాయం చేసుకున్నప్పటికి వారిని గుర్తించి వారికి పట్టాలను మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారలకు సూచించడం జరిగిందన్నారు. మంత్రి ఆనం సూచనల మేరకు భూములను అనుభవిస్తున్న వారి పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు రైతు సంఘం కార్యదర్శి కృష్ణ ప్రసాద్, సిజెఎఫ్ఎస్ సంస్థ సభ్యులు పెంచలయ్య, కొండా వెంకటేశ్వర్లు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆగని పాలిథిన్ కవర్ల వినియోగం

## - ప్లాస్టిక్ కవర్ల వలన ప్రాణహాని : కన్స్యూమర్ రైట్స్ మండల అధ్యక్షులు మావిళ్ల ఆనంద్ రావు

**సంగం, (రాజధాని వార్తలు):** సంగం సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లో వినియోగం అధికంగా ఉందని, పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పాలిథిన్ కవర్ల వాడకం పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది అని సంగం మండల కన్స్యూమర్ రైట్స్ అధ్యక్షులు మావిళ్ల ఆనంద్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కవర్ల వాడకం విచ్చలవిడిగా కొనసాగుతుంది అని తెలిపారు. ప్లాస్టిక్ నివారణకు అధికారులు ఎన్ని చర్యలు చేపడుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో పలితాలు రావడం లేదు అని అన్నారు. కిరాణా దుకాణాలు, హోటల్స్ వద్ద కవర్ల వినియోగం యథేచ్ఛగా కొనసాగుతుంది అని తెలిపారు. ప్రజల్లో కూడా మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ఇటీవలకాలంలో నిషేధిత పాలిథిన్ వస్తువుల వినియోగం బాగా పెరిగి, తాగునీటి డబ్బాలు, ఆహార పదార్థాల పార్శిళ్లు, నిత్యావసర సరకులు, కూరగాయలు, దుస్తులు, పాలు, పండ్ల రసాలు, టీ సైతం ఆయా సంచుల్లోనే ఇస్తున్నారు అని సందర్భంగా తెలియజేశారు. 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్ సంచుల వాడకం మనిషి ఆరోగ్యానికి తీవ్రనష్టం చేకూర్చుతాయని నిపుణులు చెబుతున్నారు. వాటి వినియోగంపై ప్రభుత్వాలు నిషేధం విధించినా నేటికీ మార్కెట్లో విరివిగా ఇవి దొరుకుతున్నాయి అని తెలిపారు. పట్టణ ప్రాంతాలతో పాటు నగరాలలో వ్యాపార దుకాణాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో అధికారులు ఆడపా దడపా దాడులు చేసి నిషేధిత పాలిథిన్ సంచులు వినియోగించే దుకాణాల వారికి జరిమానాలు



విధించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అటువంటి దాఖలాలు కనిపించడంలేదు అని తెలిపారు. గ్రామస్థాయిలో అధికారులు పర్యవేక్షణ, తనిఖీలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారు అని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అధికారులు కఠినంగా వ్యవహరించడంతో పాటు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలి అని అన్నారు. ప్రతి దుకాణం వద్దకు వెళ్లి వస్త్రాలతో కుట్టిన చేతిసంచులు వాడాలని సూచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. నిబంధనలు అతిక్రమించిన దుకాణాల వారిపై జరిమానాలు విధించాలని సంగం కన్స్యూమర్ రైట్స్ అధ్యక్షులు మావిళ్ల ఆనంద్ రావు తెలిపారు. దీని వినియోగం పై ప్రజల్లో కూడా చైతన్యం రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కింగ్ డమ్ రిలీజ్ ఎప్పుడు? ఇలా లేట్ అయితే ఇబ్బందే!



టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కింగ్ డమ్. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఆ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీలంక శరణార్థుల బ్యాక్ డ్రాప్‌లో సీరియస్ డ్రామాగా రూపొందిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బొర్సే హీరోయిన్‌గా నటిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న కింగ్ డమ్ మూవీపై ఆడియన్స్‌లో మంచి అంచనాలు ఉన్నాయి. మేకర్స్ కొద్ది రోజుల క్రితం రిలీజ్ చేసిన టీజర్ మ్యాసివ్ రెస్పాన్స్ అందుకుంది. ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ క్లిక్ అయిందనే చెప్పాలి. సూపర్ విజువల్స్‌తో ఫుల్ యాక్షన్ మోడ్‌లో ఉన్న టీజర్.. అందరినీ ఆకట్టుకుంది. సినిమాలో విజయ్ పవర్ ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. అయితే సినిమా షూటింగ్‌ను ఇప్పటికే పూర్తి చేయగా.. ప్రస్తుతం కింగ్ డమ్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు నిర్వహిస్తున్నారు మేకర్స్. కానీ ఇప్పటి వరకు రిలీజ్ డేట్‌పై క్లారిటీ ఇవ్వడం లేదు. మే 30వ తేదీన రిలీజ్ చేస్తామని తొలుత ప్రకటించిన మేకర్స్.. ఆ తర్వాత జూలై 4కు వాయిదా వేశారు. ఇప్పుడు ఆ రోజు నితిన్ తమ్ముడు మూవీ రిలీజ్ అవుతుండడంతో మరోసారి కింగ్ డమ్ వాయిదా పడడం ఖాయం. జులై 25న రిలీజ్ చేయాలని ఆలోచిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

అయితే అప్పటికి కూడా ఇంకా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కంప్లీట్ అయ్యేలా లేదని తెలుస్తోంది. ఎందుకంటే అని రుధ్ రవిచందర్ ఇప్పుడు కూలీ మూవీతో బిజీగా ఉన్నారట. అవి కంప్లీట్ అయ్యాక కింగ్ డమ్ పనిని పూర్తి చేస్తానని చెప్పారని టాక్. అదే నిజమైతే జులై 25న కూడా కింగ్ డమ్ రిలీజ్ కావడం కూడా డౌటే. ఆగస్టు 1వ తేదీన రిలీజ్ చేద్దామనుకుంటే.. ఆ రోజు దుల్కర్ సల్మాన్ కాంత మూవీ విడుదల అవ్వనుందట. ఆ తర్వాత రెండు వారాలకు తారక్ బాలీవుడ్ డెబ్యూ వార్-2, రజినీకాంత్ కూలీ చిత్రాలు రానున్నాయి. దీంతో జూలై 25న మిస్ అయితే ఇంకా లేట్ అవుతూనే ఉంటుంది. ఇలా ఆలస్యమైతే మూవీపై బజ్ తగ్గుతుందనే చెప్పాలి. దీంతో మేకర్స్ కు ఇబ్బందిగా మారుతుంది. అందుకే ప్రమోట్ చేస్తూనే ఉండాలి. మరేం చేస్తారో చూడాలి.

# బన్నీ - వంగా మూవీ సంగతేంటి?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్- టాలెంటెడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో మూవీ రూపొందనున్నట్లు కొన్ని నెలల క్రితం అనౌన్స్మెంట్ వచ్చిన విషయం తెలిసిందే. సందీప్ వంగా తెరకెక్కించిన యానిమల్ సినిమాకు ముందే ఆ ప్రకటన వెలువడింది. కానీ అనుకోని కారణాల వల్ల ఇప్పటికీ ఆలస్యమవుతోంది. స్పిరిట్ మూవీ కన్నా ముందు సందీప్ వంగా.. అల్లు అర్జున్ సినిమా చేస్తారని అంతా అనుకున్నారు. కానీ మొన్నటి వరకు బన్నీ.. పుష్ప-2తో బిజీగా ఉన్నారు. దీంతో వంగా.. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్‌లో నటించనున్న స్పిరిట్ పై ఫోకస్ పెట్టారు. మోస్ట్ వైలెన్స్ సినిమాగా రానున్న ఆ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్‌ను పూర్తి చేస్తున్నారు. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను మొదలు పెట్టనున్నారు. అయితే ఆయన లైనప్‌లో యానిమల్ మూవీ సీక్వెల్ కూడా ఉంది. అదే సమయంలో ఇప్పుడు అల్లు అర్జున్.. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీతో వర్క్ చేస్తున్నారు. సూపర్ హీరో కాన్సెప్ట్ తో రానున్నట్లు ప్రచారం జరుగుతున్న ఆ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. ఇప్పుడు అల్లు అర్జున్.. తెలుగు, మలయాళం, హిందీ ఇండస్ట్రీలకు చెందిన ఇతర దర్శకులతో చర్చలు జరుపుతున్నారని సమాచారం. త్రివిక్రమ్‌తో ఆయన చేయాల్సిన సినిమా రద్దైందని.. జూనియర్ ఎన్టీఆర్‌కు ఆ ప్రాజెక్ట్ వెళ్లిందని జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే అల్లు అర్జున్- అట్లీ మూవీ పూర్తవ్వడానికి సమయం ఎక్కువే పట్టనుంది. దీంతో అటు అల్లు అర్జున్.. ఇటు సందీప్ వంగా.. ఇద్దరూ తమ కమిట్మెంట్స్‌తో బిజీగా ఉన్నారు. కాబట్టి వారిద్దరి ప్రాజెక్ట్ ఎప్పుడు ఉంటుందో క్లారిటీ లేదు. రీసెంట్‌గా బన్నీ బదులు రామ్ చరణ్ నటిస్తారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా.. అది నిజం కాదని తెలుస్తోంది. రూమర్స్ నేనని సమాచారం. అలా సందీప్ వంగా, అల్లు అర్జున్ ప్రాజెక్ట్ ఉండటం నిజమేనని.. కానీ ఎప్పుడు అనేది ఇంకా ఫిక్స్ అవ్వనట్లు తెలుస్తోంది. ఏదేమైనా వారి కాంబో.. ఇండస్ట్రీలో క్రేజీ కాంబినేషన్స్ లో ఒకటని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. మరి వంగా, బన్నీ మూవీ ఎప్పుడు స్టార్ట్ అవుతుందో.. ఇద్దరిలో ఎవరైనా రెస్పాండ్ అయ్యి చిన్న అప్డేట్ అయినా ఇస్తారేమో వేచి చూడాలి.

# 'ది రాజాసాబ్' కోసం బాలీవుడ్ క్లాసిక్ సాంగ్..కానీ!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన భారీ కామెడీ హారర్ థ్రిల్లర్ 'ది రాజాసాబ్'. మారుతి డైరెక్ట్ చేసిన ఈ సినిమా టీజర్ ఎట్టకేలకు రిలీజ్ కావడం తెలిసిందే. గత కొంత కాలంగా ఆలస్యం అవుతూ వచ్చిన టీజర్ ఫైనల్‌గా ప్రేక్షకుల ముంతుకు వచ్చేసింది. కళ్లు చెదిరే విజువల్స్, డార్లింగ్ ప్రభాస్ మార్కు కామెడీ పంచ్‌లు, మారుతి మార్కు కామెడీ హారర్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ సినిమా టీజర్ ప్రేక్షకులతో పాటు అభిమానుల్ని కూడా విశేషంగా ఆకట్టుకుంటూ యూట్యూబ్‌లో ట్రెండ్ అవుతోంది. ఇందులోని కీలక పాత్రలో బాలీవుడ్ స్టార్ సంజయ్‌దత్ నటించారు. ఆయన ప్రభాస్‌కు తాతగా ఓ మహల్‌ని ఆవహించిన ఘోస్ట్ క్యారెక్టర్‌లో సంజయ్ దత్ కనిపించబోతున్నారు. ప్రభాస్ సీరిస్ టోన్‌ని వీడి కామెడీ పంచ్‌లతో తనదైన మార్క్ హాస్యంతో అలరించబోతున్నారని టీజర్‌తో స్పష్టమైంది. ఇక ఇందులో ప్రభాస్‌కు జోడీగా ముగ్గురు ముద్దుగుమ్మలు నటించారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ మూవీలో ప్రభాస్‌తో రొమాన్స్ చేస్తున్నారు. అయితే ఈ మూవీ కోసం ప్రభాస్ ఇంట్రడక్షన్ సాంగ్‌ని దర్శకుడు మారుతి ఓ రేంజ్‌లో ప్లాన్ చేశాడట. ఇందులో ప్రభాస్‌తో పాటు ముగ్గురు హీరోయిన్‌లు కూడా ఉండేలా డిజన్ చేశాడట. దీని కోసం బాలీవుడ్ క్లాసిక్ సాంగ్‌ని తీసుకుని దాన్నే రీమిక్స్‌గా వాడాలనుకున్నాడట. కానీ ఆడియో రైట్స్ గుర్తుకొచ్చి సదరు బాలీవుడ్ క్లాసిక్ సాంగ్‌కు సంబంధించిన వారిని సంప్రదిస్తే రాజాసాబ్ టీమ్‌కు కళ్లు బైర్లు కమ్మాయని తెలిసింది. సదరు బాలీవుడ్ సంస్థ క్లాసిక్ సాంగ్ కోసం రైట్స్ రూపంలో రూ.5 కోట్లు డిమాండ్ చేసి షాక్ ఇచ్చిందట.

దాంతో షాక్‌కు గురైన చిత్ర బృందం ఆ ఆలోచనలో పడినట్టు తెలిసింది. ప్రభాస్‌తో కలిసి ముగ్గురు హీరోయిన్‌లు డ్యాన్స్ చేసే ప్రత్యేక సాంగ్ కాబట్టి క్లాసిక్ సాంగ్ ని తీసుకుంటే సినిమాకు హైలైట్ అవుతుందని భావిస్తే బాలీవుడ్ సంస్థ రూ.5 కోట్లు డిమాండ్ చేయడంతో ఆ ఆలోచనని మేకర్స్ విరమించుకున్నారట. అంత మొత్తం ఇచ్చి మళ్లీ పాట రాయించుకొని, మ్యూజిక్ చేయించుకోవడం ఎందుకు.. తమన్ చేతే కొత్త పాట చేయిస్తే బాగుంటుందని భావించి ఆ బాధ్యతల్ని మళ్లీ తమన్‌కే అప్పగించారట. ఇలాంటి పాటల్ని చేయడంలో తమన్ సిద్ధమస్తుడు కావడంతో అనుకున్న స్థాయిలో ఈ పాట వచ్చేసిందని, థియేటర్లలో ఆడియన్స్ ఈ పాటకు ఉర్రూతలూగడం ఖాయమని తెలుస్తోంది.

# థగ్ లైఫ్ : సుప్రీం కోర్ట్ షాకింగ్ వార్నింగ్



యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ హీరోగా రూపొందిన థగ్ లైఫ్ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మణిరత్నం దర్శకత్వంలో కమల్ హాసన్ నటించిన సినిమా కావడంతో అంచనాలు భారీగా పెరిగాయి. వీరి కాంబోలో చాలా ఏళ్ల క్రితం 'నాయగన్' సినిమా వచ్చింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. క్లాసిక్ మూవీగా నిలిచిన ఆ సినిమా రేంజ్‌లో థగ్ లైఫ్ ఉంటుందని మేకర్స్ మొదటి నుంచి చెబుతూ వచ్చారు. కానీ థగ్ సినిమా ఆకట్టుకోలేక పోయింది. సినిమా విడుదల తర్వాత సంగతి పక్కన పెడితే విడుదలకు ముందు చాలా పెద్ద వివాదం నడిచింది. కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యల కారణంగా ఈ సినిమాను కర్ణాటకలో విడుదల కానివ్వలేదు. దాంతో కన్నడంలో ప్రచారం చేసినా కూడా రిలీజ్ కాలేదు. తమిళ్, తెలుగు, హిందీ భాషల్లో విడుదలైన ఈ సినిమా కన్నడ భాషలో విడుదల చేయడంకు కమల్ చేసిన ప్రయత్నం విఫలం అయింది. కర్ణాటక హైకోర్ట్ సైతం కమల్‌కి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసింది. కన్నడ భాష గురించి కమల్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు కనుక క్షమాపణలు చెప్పి ఆ తర్వాత సినిమా విడుదల చేసుకోవాలని హైకోర్ట్ వ్యాఖ్యానించింది. కన్నడంలో సినిమా విడుదల కాకున్నా పర్వాలేదు అని, తాను మాత్రం క్షమాపణ చెప్పేది లేదని కమల్ తేల్చి చెప్పాడు. దాంతో అక్కడ విడుదల కాకుండానే ఇతర భాషల్లో విడుదల అయింది. థగ్ లైఫ్ సినిమాను కర్ణాటక ప్రభుత్వం మొదలుకుని పలు సంఘల వారు అడ్డుకోవడంపై సుప్రీం కోర్ట్‌ను చిత్ర యూనిట్ సభ్యులు ఆశ్రయించారు. కమల్ తరపున థగ్ లైఫ్ సినిమా కన్నడ వివాదం గురించి సుప్రీం కోర్ట్‌ను ఆశ్రయించారు. థగ్ లైఫ్ మేకర్స్ పిటీషన్‌ను స్వీకరించిన సుప్రీం కోర్ట్ విచారణకు సిద్దం అయింది. కర్ణాటక ప్రభుత్వ వివరణ కోరిన సుప్రీం కోర్ట్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. థగ్ లైఫ్ సినిమా విడుదల విషయమై సుప్రీం కోర్ట్ ప్రభుత్వంకు వార్నింగ్ ఇస్తూ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. కమల్ వ్యాఖ్యల నేపథ్యంలో సినిమా విడుదలను అడ్డుకున్న వారిపై సుప్రీం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడం ఏమాత్రం కరెక్ట్ కాదని... ఈ సమయంలో ప్రభుత్వం ఏం చేస్తుందని సుప్రీం కోర్ట్ ప్రశ్నించినట్లు సమాచారం అందుతోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ కర్ణాటకలో థగ్ లైఫ్ సినిమా విడుదల కావాల్సిందే అని సుప్రీం కోర్ట్ పేర్కొంది. సినిమా విడుదలను అడ్డుకోవడం అనేది ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడం అవుతుందని సుప్రీం పేర్కొంది. దాంతో త్వరలోనే కర్ణాటకలో థగ్ లైఫ్ సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

కమల్ హాసన్‌తో పాటు శింబు ముఖ్య పాత్రలో నటించిన ఈ సినిమాలో త్రిష, అభిరామి హీరోయిన్స్‌గా నటించారు. ఈ సినిమాకు ఏఆర్ రహమాన్ సంగీతాన్ని అందించాడు. సినిమాకు ఆశించిన స్థాయిలో పాజిటివ్ టాక్ రాకపోవడంతో వసూళ్లు నిరుత్సాహం కలిగించాయి. కమల్ ఈ కథను ఒప్పుకుని తప్పు చేశాడు అంటూ అభిమానులు స్వయంగా కామెంట్ చేస్తున్నారు.

# నిలువ నీడలేని అనాధలైన అభాగ్యులకు ప్రభుత్వం "నిరాశ్రయ ఆదరణ ఆశ్రమం"ను నిర్మించాలి

## - సిద్దార్ధ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణము ఆధ్వర్యములో ఆర్.డి.ఓ.కార్యాలయం వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన, ఆర్.డి.ఓ.కార్యాలయ పాలనాధికారి శ్రీనివాసరావుకి వినతిపత్రం





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** స్థానిక సిద్దార్ధ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణము ఆధ్వర్యములో దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేర ప్రతీ జిల్లా ప్రధాన కేంద్రములో రోడ్లపై ఏ విధమైన నిలువ నీడలేక అనాధలైన నిర్భాగ్యులకు నిరాశ్రయ ఆదరణ ఆశ్రమములు (ఆర్ఫాన్స్ షెల్టర్ హోమ్స్) ను ప్రభుత్వమే బాధ్యత వహించి ఆ ఆశ్రమాలను నిర్మించి వారిని ఆదుకోవాలని ఆదేశాలను జారీ చేయడం జరిగిందని, అయితే దురదృష్టవశాత్తు జిల్లా కేంద్రంగా అనకాపల్లి ఏర్పాటు అయి ఆరు సంవత్సరాలు అయినా గాని ఇంతవరకు జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో "నిరాశ్రయ ఆదరణ ఆశ్రమం" (ఆర్ఫాన్స్ షెల్టర్ హోమ్)ను ప్రభుత్వం తక్షణమే నిర్మించి నిరాదరణకు గురయి ఏ విధమైన గూడు, నీడ లేక ఎండలో, వానలో, చలిలో జీవచ్ఛవాలువా తమ జీవితాలను గడుపుతున్న వారికి ఈ నిరాశ్రయ ఆదరణ ఆశ్రమం (ఆర్ఫాన్స్ షెల్టర్ హోమ్)ను తక్షణమే నిర్మించి మానవతతో వారిని ఆదుకోవాలని ఆర్.డి.ఓ. కార్యాలయము వద్ద బల్లా నాగభూషణం తమ సంస్థ సభ్యులతో కలిసి ప్లకార్డులతో నిరశన ప్రదర్శన చేసి అనంతరం ఆర్.డి.ఓ. కుమారి షేక్ ఆయేషాని కలిసి వారి ఆదేశాల మేర, ఆర్.డి.ఓ..కార్యాలయ పాలనాధికారి శ్రీనివాసరావుకి బల్లా నాగభూషణము వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బల్లా నాగభూషణము మాట్లాడుతూ అనకాపల్లి పట్టణములోనే సుమారు రెండు వందల మంది వరకు ఏ విధమైన ఆసరా లేక రోడ్లపైనే జీవిస్తున్న అనాధలు, అభాగ్యులు, మతి స్థిమితం లేనివారు, యాచకులు, ఇతర నిరాశ్రయులు జీవచ్ఛవాలుగా తమ బ్రతుకులను గడుపుతున్నారని, ఇంకా ఇతర పరిసర ప్రాంతాలలో కూడా నిరాశ్రయులు ఉన్నారని ఇటువంటి దీనుల ఆసరా కొరకు ప్రభుత్వము మానవతతో ఆలోచించి తక్షణమే జిల్లా ప్రధాన కేంద్రం అనకాపల్లి పట్టణం లో నిరాశ్రయ ఆదరణ ఆశ్రమము (ఆర్ఫాన్స్ షెల్టర్ హోమ్) నిర్మించి వారికి ఆశ్రయం కల్పించి ఆదుకోవాలని అన్నారు.

ఈ విషయముపై జిల్లా కలెక్టర్ కె.విజయ క్రిష్ణన్, జిల్లా ప్రభుత్వ సాంఘిక సంక్షేమాధికారి బోని రామానం దము, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ఈ ఆదరణ ఆశ్రయంను నిర్మాణం చేయగలందులకు కృషి చేయాలని బల్లా నాగభూషణము తెలియజేశారు. ఈ కార్యక్రమములో సిద్దార్ధ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణము, కార్యదర్శి వినకోట నీలేషగుప్తా ఉపాధ్యక్షులు పట్నాల కృష్ణమోహన్, సహాయ కార్యదర్శి రొబ్బి మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు బొడ్డు సోమ రాజు, ఊడా నాగేశ్వరరావు, ఐ.వి.రమణమూర్తి, పొట్టి శ్రీరాములు భవన్ చైర్మన్ పిరాట్ల నరసింహ మూర్తి పాల్గొన్నారు.

# యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం : అగనంపూడి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.పి.ఉషా










**విశాఖ, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 85 వార్డు అగనంపూడి ఏరియా ఆసుపత్రిలో 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమము భారీ ఎత్తున నిర్వహించడం జరిగినది. డాక్టర్ పి ఉష మాట్లాడుతూ నేటి యుగములో విద్య వ్యాపార సాఫ్ట్వేర్ ఇంజనీర్స్ తమ విధి నిర్వహణలో బిజీగా ఉంటూ శరీర ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేస్తున్నారు. కావున యోగాన్ని నిత్య దినచర్యలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. మౌంట్ అబు నుండి విచ్చేసిన బి కే దిల్ రాజ్ మాట్లాడుతూ యోగ అనేది భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలకు పుట్టినిల్లు లాంటిది దానిని మళ్లీ ప్రపంచ దేశాలలో చాటి చెప్పిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి అందరము కృతజ్ఞతలు చెప్పాలి. ఇది విస్తృతంగా 185 దేశాలలో ఆచరిస్తున్నారని అన్నారు. 85 వార్డు ఇన్చార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాదు, 85 వార్డు టిడిపి అధ్యక్షులు కర్రి దేశేంద్ర మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై ఎంతో నమ్మకంతో ఇంటర్నేషనల్ యోగ డే విశాఖపట్నంలో పెట్టాలని చెప్పిన మేరకు చంద్రబాబు నాయుడు కూటమి నాయకుల్ని సమాయత్తం చేస్తూ ఎంతో ప్రతిష్టాకరంగా ఈనెల 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే యోగ డే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత తీసుకొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అగనంపూడి ఏరియా ఆసుపత్రి ప్రప్రధమ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డి రవి రాజు సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడిసి చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ విశాఖ జిల్లా బ్రహ్మకుమారి కోఆర్డినేటర్ సోమేశ్వరి అక్కయ్య విశాఖ లైన్స్ క్లబ్ చైర్పర్సన్ కడిమి హనుమంతరావు అగనంపూడి బిజెపి అధ్యక్షులు కోసూరి తాతారావు డాక్టర్ గోపాలకృష్ణ నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి స్థానిక టిడిపి నాయకులు విందుల రాజు, కొర్రయి జగదీష్ ,ముచ్చ అప్పలరాజు, డొక్కా రమేష్, బండారు చందు రమేష్, మాడిసి వెంకట్రావు, టిడిపి మహిళా నాయకురాలు సత్యవతి అన్నపూర్ణ పద్మ మరియు నర్సింగ్ స్టాఫ్ ల్యాబ్ ఐసిటిసి ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం బ్రహ్మకుమారిస్ రామకోటి రాము కోటి నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఆసానాలు, మెడిటేషన్పై శిక్షణ ఇవ్వడం జరిగినది.



# శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అష్టమి వార్షికోత్సవంలో భాగంగా పెండ్లి రాట మహోత్సవం








**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయములో అష్టమి వార్షికోత్సవం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు బోగాపురపు వెంకటరమణ (బాబు), ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆలయ అష్టమి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ శాశ్వత చైర్మన్, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల సౌజన్యంతో అమ్మవారి ఆలయం వద్ద పెండ్లి రాట మహోత్సవం ఘనంగా జరిగింది. పెండ్లిరాట పూజలో పాల్గొన్న దంపతులు. పొలమర శెట్టి వెంకట అప్పారావు వాణి, బుద్ధ సంతోష్ హేమ లత, పొలిమేర శ్రీనివాసరావు జయ, ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ భీమర శెట్టి వరాహ నూకరాజు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీ పరమేశ్వరుల కమిటీ సభ్యులు, శ్రీ మరిడిమాంబ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీ పరమేశ్వరి ప్రజాటెంట్ హౌస్, తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి విశాఖలో ట్రాఫిక్ ఆంక్షలు

**విశాఖ, (రాజధాని వార్తలు):** విశాఖలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు సీపీ శంకబ్రాత బాగ్చి సోమవారం తెలిపారు. జూన్ 17 నుండి 21 వరకు ఆర్కే బీచ్లో ఎన్టీఆర్ సర్కిల్ నుంచి పార్క్ హోటల్ వరకు వాహనాలు నిషేధించారు. జూన్ 19 నుంచి 21 వరకు పార్క్ హోటల్ నుంచి భీమిలి బీచ్ వరకూ బీచ్ రోడ్డుపై సాధారణ వాహనాలకు అనుమతి ఉండదన్నారు.

# విద్యాశాఖలో బదిలీలు పారదర్శకం మంత్రి లోకేష్ ఘనతే : బుద్ధ నాగ జగదీష్



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు ఎటువంటి అవినీతి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించిన ఘనత విద్యాశాఖ మంత్రి లోకేష్ కే దక్కుతుందని మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఈరోజు తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రప్రదంగా ఉపాధ్యాయుల కళ్ళల్లో ఆనందాన్ని చూస్తున్నామని అటు తల్లుల ఖాతాలో తల్లికి వందనంతో పాటు ప్రతి చర్య పారదర్శకంగా కూటమి ప్రభుత్వం అమలు పరిచిందని ఘనత లోకేష్ కే దక్కుతుందని నాగ జగదీష్ అన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో సుమారు 2200 మందికి స్థానచలనం కలిగిందని, ఇందులో గ్రేట్ టు హెచ్ఎంలు, డ్రిల్ మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు వెరసి మొత్తం 2200 మందికి బదిలీలు జరిగాయని నాగ జగదీష్ అన్నారు. రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి కాండ్రేగుల సత్యనారాయణ ఇరువురు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ నాడు బదిలీల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయని చాలామంది నష్టపోయారని, మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు జిల్లా పరిషత్ చైర్మన్ సిఫార్సు లేఖలు ప్రామాణికంగా తీసుకుని అవినీతికి పాల్పడి బదిలీలు చేసి ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని కాశీ సత్యనారాయణ అన్నారు. టీచర్లు బదిలీల్లో ఇంగ్లీష్ టీచర్లు 272 మంది మ్యాథమెటిక్స్ టీచర్స్ 270, ఫిజిక్స్ టీచర్స్ 200, సోషల్ టీచర్స్ 220, తెలుగు టీచర్స్ 170, హిందీ టీచర్స్ 170, ఎస్ఎస్ టీటర్లు 170 మంది బదిలీలు అయ్యారని, అన్యాయంగా బదిలీ అయ్యి మన్యానికి పంపించిన టీచర్లను మైదానానికి తీసుకు వచ్చిన ఘనతలో విద్యాశాఖ మంత్రి లోకేష్కే దక్కుతుందని కాశీ సత్యనారాయణ అన్నారు.

# కొత్త భాషపై అవగాహన పెంచుకుందాం : డివైఇఓ

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** జాతీయ ఎడ్యుకేషన్ పాలసీలో భాగంగా ప్రతి విద్యార్థి మాతృభాష తెలుగు, జాతీయ భాష హిందీ, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్తో పాటు మరో భాషను నేర్చుకోవడంపై దృష్టి సారించాలని ఎన్సిఇఆర్టి సూచనలు చేసిన మేరకు మన జిల్లా కలెక్టర్ ఆదేశంతో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో "తమిళం నేర్చుకొందాం" అనే కార్యక్రమంను వారం రోజుల పాటు స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రారంభిస్తున్నట్లు కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక హైస్కూల్లో ప్రధానోపా ధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప విద్యా శాఖాధికారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బహుభాషా ప్రావీణ్యం వల్ల వ్యక్తిగత ప్రయోజనంతో పాటు జాతీయ సమైక్యతభావం కూడా ఏర్పడుతుందని, ఇతర భాషల వారి సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని గౌరవించడం అలవడుతుందన్నారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగం పొందే విద్యార్థులకు ఈ రకమైన ఇతర భాషా అభ్యాసనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. బహుభాషా శిక్షకులు స్థానిక ప్రభుత్వ కళాశాల లెక్చరర్ కే సత్యనారా యణ తమిళ భాష నేర్చుకోవడంలో మెలకువలు ప్రయోజనాలు వివరించారు. పెద్దాపురం నవోదయ విద్యాలయానికి చెందిన అధ్యాపకులు రాజ్యలక్ష్మీ విద్యార్థులకు కొన్ని పదాలు నేర్పారు. వారం రోజుల పాటు ఎంపిక చేసిన 60 మంది విద్యార్థులకు ఈ శిక్షణను డిఈఓ ఆదేశాల మేరకు ఈ పాఠశాల కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు డివైయిఓ తెలిపారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan